
TELUGU NEWS TIMES
# తెలుగు న్యూస్ టైమ్స్
జాతీయ దిన పత్రిక

J.M.Nayudu
Cell: 91 9840066999
SCCI
Sai Charan Comfort Inn
(Luxury Service Apartments)
Plot No. 1286 & 1345, 5th Street, Golden Colony,
Anna Nagar West Extn., Mugappair, Chennai-50.
Mobile : +91 9840089859, E-mail : saicomfortinn@gmail.com

సంపుటి : 3 | సంచిక : 214 | శనివారం 23 నవంబరు 2024 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840467131 | online E-paper



# రాష్ట్ర బ్రాండ్‌ను దెబ్బతీశారు..

- వైసీపీ హయాంలో ఏపీ ప్రతిష్ట పోయింది..
- రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత ప్రజాప్రతినిధులపైనే
- సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను బ్యాలెన్స్ చేస్తున్నాం..
- శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు

అమరావతి : గత ఐదేళ్ల వైసీపీ హయాంలో ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ఠ, బ్రాండ్‌ను దెబ్బతీసేలా ప్రవర్తించారని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విమర్శించారు. శాసనసభ సమావేశాల్లో ఆయన ప్రసంగించారు. "జగన్ చేసిన అవినీతి అంశాన్ని ప్రస్తావించడానికి కూడా ఇబ్బందికరమైన పరిస్థితి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ అంశాన్ని జాగ్రత్తగా గమనిస్తోంది. మరింత సమాచారం తీసుకుని తగిన విధంగా స్పందిస్తాం. అమెరికా కోర్టులో వేసిన ఛార్జిషీట్ కూడా మా దగ్గర ఉంది. దీనిపై అధ్యయనం చేసి ఎలాంటి చర్యలు చేపట్టాలో నిర్ణయం తీసుకుంటాం" అని తెలిపారు.

### భద్రత లేకుంటే పెట్టుబడులకు ఎవరొస్తారు?

రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను బ్యాలెన్స్ చేస్తూ కార్యక్రమాలు చేపడుతున్నామని చంద్రబాబు చెప్పారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని.. రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని చెప్పారు. భద్రత లేకుంటే రాష్ట్రంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రారన్నారు. శాసనసభలో 'స్వర్ణాంధ్ర-2047' డాక్యుమెంట్‌పై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. 'వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నినాదంతో దీన్ని రూపొందించినట్లు చెప్పారు.

### ఏ రాజకీయ నాయకుడూ ఇన్ని తప్పులు చేయరు..

"వైసీపీ ప్రభుత్వ అక్రమాలపై లోతుల్లోకి వెళ్లే కొద్దీ ఆశ్చర్యకర విషయాలు తెలుస్తున్నాయి. చరిత్రలో ఏ రాజకీయ నాయకుడూ ఇన్ని తప్పులు చేయరు. వ్యవస్థలు విధ్వంసమయ్యాయి. అధికార యంత్రాంగం మొత్తం నిర్వీర్యమైంది. అప్పులు పరాకాష్ఠకు చేరాయి. తప్పుడు ప్రచారాన్నే ఆధారంగా చేసుకుని పనిచేశారు. వాస్తవాలు చెప్పినా వాటిని పక్కన పెట్టి అసత్యాలను పదేపదే చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని చూశారు. ఇది చాలా దురదృష్టకరమైన రాజకీయం. బరితెగించి తప్పులు చేసి వాటిని ఒప్పులుగా చిత్రీకరించారు. ఇలాంటి విచిత్ర పరిస్థితిని నా 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎప్పుడూ చూడలేదు. ఎన్నికల్లో ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చారు. 93 శాతం స్ట్రయిక్ రేటుతో కూటమికి అధికారం కట్టబెట్టారు. 1995లో నేను తొలిసారి సీఎం అయినప్పుడు ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉంది. ప్రజలకు చెప్తే సహకరించారు. అనివార్య పరిస్థితుల్లో అప్పట్లో రూ.2కి అందించే కిలో బియ్యం ధర పెంచాల్సి వచ్చింది. 1999లో విజన్-2020 తీసుకొచ్చాం. నాలెడ్జ్ ఎకానమీకి హైదరాబాద్ చిరునామాగా మారింది. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలంటే భద్రత ఉండాలి. ప్రజలు కూడా దీన్ని అర్థం చేసుకోవాలి. వారికి చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. ప్రజలను చైతన్యం చేయాలి." అని అన్నారు.

### ఎమ్మెల్యేలపై గురుతర బాధ్యత

"2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు అవుతుంది. ప్రధాని మోదీ వికసిత్ భారత్ పిలుపునిచ్చారు. మనం స్వర్ణాంధ్ర-2047 నినాదంతో ముందుకెళ్లాలి. ఎమ్మెల్యేలపై గురుతర బాధ్యత ఉంది. నియోజకవర్గ పరిధిలోనూ విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలి. 2047 నాటికి మీ నియోజకవర్గం ఎలా ఉండాలని కోరుకుంటున్నారో అందులో పొందుపర్చాలి. ప్రజలకు సేవ చేస్తే ఏ నియోజకవర్గమైనా గెలిపిస్తారు"అని అన్నారు.

## వైకాపా హయాంలో రూ.331 కోట్ల ఉపాధి హామీ నిధుల మళ్లింపు



**అమరావతి:** జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.4,500 కోట్లతో 30 వేల పనులు చేపట్టినట్లు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. సంక్రాంతి లోపు వీటిని పూర్తి చేస్తామన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. గతంలో వైకాపా హయాంలో ఉపాధి పథకం నిధుల మళ్లింపు, జాబ్ కార్డుల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేస్తున్నట్లు చెప్పారు. సాగు పనులను ఉపాధి హామీకి అనుసంధానంపై పరిశీలిస్తామని చెప్పారు. ఉపాధి హామీ కింద కాలువల్లో పూడిక, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేయవచ్చన్నారు. శ్మశానాల ప్రహరీ గోడల నిర్మాణం చేపట్టవచ్చని పేర్కొన్నారు. గతంలో రూ.331 కోట్ల ఉపాధి హామీ నిధుల మళ్లింపుపై విచారణ చేస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నాశనం చేసిందని విమర్శించారు.

## 8 కీలక బిల్లులకు ఏపీ శాసనమండలి ఆమోదం



**అమరావతి:** ఇప్పటికే శాసనసభలో ఆమోదం పొందిన 8 కీలక బిల్లులకు శుక్రవారం శాసనమండలి ఆమోదం తెలిపింది. విజయనగరం జిల్లాలోని భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాలని కేంద్ర పౌరవిమానయాన శాఖను కోరుతూ మండలి తీర్మానం చేసింది. **మండలిలో ఆమోదం పొందిన బిల్లులివే..**

- చెత్తపన్ను విధిస్తూ గత ప్రభుత్వం చేసిన చట్టాన్ని శాసనమండలి రద్దు చేసింది
- లోకాయుక్త సవరణ బిల్లు 2024కు శాసనమండలి ఆమోదం
- గూడ్స్ అండ్ సర్వీసెస్ సవరణ బిల్లు 2024కు శాసన మండలి ఆమోదం
- ఏపీలో సహజవాయు వినియోగంపై జీఎస్టీ పన్నును తగ్గిస్తూ జీఎస్టీ సవరణ బిల్లుకు మండలి ఆమోదం
- ఏపీ హిందూ ధార్మిక, మత సంస్థలు దేవాదాయ చట్ట సవరణ బిల్లుకు శాసన మండలి ఆమోదం
- ఏపీ మౌలిక సదుపాయాలు న్యాయపరమైన పారదర్శకత జ్యుడిషియల్ ప్రివ్యూ రద్దు బిల్లుకు ఆమోదం
- ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ 2024 రద్దుకు శాసనమండలి ఆమోదం
- పీడీ యాక్ట్ సవరణ బిల్లు 2024కు ఆమోదం తెలిపింది. కీలక బిల్లులకు ఆమోదం తెలిపిన అనంతరం శాసనమండలి నిరవధిక వాయిదా పడింది.

# చేనేత కార్మికులపై పన్ను వివాదం



**అన్నా నగర్ న్యూస్** :తమిళనాడులో చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చేనేత రంగాన్ని పునరుజ్జీవింపజేసి, కార్మికుల జీవితాలను మెరుగుపరిచే హామీలతో అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం ఇప్పుడు చేనేత కార్మికులపై వ్యాపార పన్ను విధించేందుకు ప్రయత్నిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ చర్యను ప్రతిపక్ష నేత ఎడప్పాడి పళనిస్వామి తీవ్రంగా ఖండించారు. చేనేత రంగానికి ఎదురవుతున్న ప్రధాన సవాళ్లు

**చీరలకు గిట్టుబాటు ధర లేకపోవడం:** సేలం, నమక్కల్, ఈరోడ్ వంటి ప్రాంతాల్లో తయారైన చీరలు సరసమైన ధరలకు విక్రయించబడలేక పోతున్నాయి. మరింతగా, ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ చీరలు దిగుమతి అవడం స్థానిక మార్కెట్‌ను దెబ్బతీస్తోంది.

**తగ్గిన ఆదాయం:** చేనేత పనిపై పూర్తిగా ఆధారపడిన కార్మికులకు సరైన ఉపాధి లేక, రోజువారీ ఖర్చులు కూడా భరించలేని పరిస్థితి నెలకొంది. పదివేల మగ్గాలు యథాస్థితిలో నిలిచిపోయాయి.

**కొత్త పన్ను విధానం వెనుక కథ** : చేనేత పరిశ్రమను కుటుంబ స్థాయిలో నిర్వహిస్తున్న నేత కార్మికులు కూడా ఇప్పుడు పన్ను చెల్లించాల్సిన పరిస్థితి రావచ్చని సమాచారం. కొందరు నేత కార్మికులు తమ ఇళ్లలో రెండో మగ్గంతో చిన్న పరిశ్రమగా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. కానీ, ప్రభుత్వం వీటిని పరిశ్రమలుగా గుర్తించి పన్ను వసూలు చేయాలని యోచిస్తోంది.

**ప్రతిపక్షానికి అభ్యంతరం** : అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకించారు. "పనిలో నష్టపోయిన కార్మికులపై వ్యాపార పన్ను విధించడం అన్యాయమని, ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునరాలోచన చేయాలి" అని అన్నారు.

**మొత్తంగా:** చేనేత రంగంలో పనిచేసే లక్షలాది కార్మికులు ఇప్పటికే ఆర్థిక ఒత్తిడితో బాధపడుతున్నారు. కొత్త పన్ను విధానం వారిని మరింతగా ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు కీలకం కానున్నాయి.

# తప్పు చేసిన ఏ ఒక్కరినీ ప్రభుత్వం విడిచిపెట్టదు : మంత్రి లోకేశ్

**అమరావతి:** తెదేపా కార్యకర్తల ధైర్యాన్ని, వైకాపా నేతల పిరికితనాన్ని ప్రజలు గమనిస్తున్నారని మంత్రి నారాలోకేశ్ అన్నారు. గత ఐదేళ్లలో అక్రమ కేసులతో ఎంత వేధించినా తెదేపా శ్రేణులు ధైర్యంగా నిలబడ్డారని తెలిపారు. సోషల్‌మీడియాలో అసభ్య పోస్టులపై పోలీసులు ఇచ్చిన నోటీసులకే వైకాపా నేతలు రాజకీయ సన్యాసం అంటున్నారని ఎద్దేవాచేశారు. నాడు తెదేపా కార్యకర్తలు తప్పు చేయలేదు కాబట్టే అక్రమ కేసులను ధైర్యంగా ఎదుర్కొంటూ పోరాటం చేశారని వెల్లడించారు. తప్పు చేసిన ఏ ఒక్కరినీ ప్రభుత్వం విడిచిపెట్టదని మంత్రి స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ లాబీలో మీడియాతో మంత్రి లోకేష్ చిట్‌చాట్ చేశారు. సామాజిక మాధ్యమాల్లో అసభ్య పోస్టులపై ప్రభుత్వం సీరియస్‌గా ఉందని పేర్కొన్నారు. వైకాపా అధినేత జగన్, ఆయన పార్టీ నాయకులు కమిటీల ఓటింగ్‌కు వస్తున్నారా? అని ఎమ్మెల్యేలను ఆరాతీశారు. బలం లేనప్పుడు పోటీ ఎందుకు పెట్టాలని ప్రశ్నించారు. అనంతరం పలువురు ఎమ్మెల్యేలతో మంత్రి లోకేశ్ చర్చించారు. జాగ్రత్తగా పని చేయమని బాధ్యతలను ఇస్తూ ఎక్కువ ఓట్లతో ప్రజలు మనల్ని గెలిపించారన్నారు. ఎమ్మెల్యేల వినతులపై లోకేశ్ స్వయంగా స్టేటస్ రిపోర్ట్ ఇచ్చారు. ఎమ్మెల్యే తనకు ఇచ్చిన ప్రతీ



వినతిపత్రంలో ఎన్ని పరిష్కారమయ్యాయి? కాకపోతే అందుకు గల కారణాలు వివరిస్తూ స్టేటస్ రిపోర్ట్ ఇచ్చారు. కేంద్ర మంత్రులకు వినతిపత్రం ఇస్తే వారు సమాధానం ఇస్తున్న విధానాన్ని ఇక్కడా అమలు చేస్తున్నామని వెల్లడించారు. రానున్న రోజుల్లో ఈ విధానాన్ని మరింత పటిష్ఠం చేస్తామన్నారు. పాఠశాలల సమయం పెంపుపై భిన్నాభిప్రాయాలు వస్తున్నాయని ఎమ్మెల్యేలు మంత్రి దృష్టికి తెచ్చారు. పైలట్ ప్రాజెక్టుగా మాత్రమే ప్రస్తుతం దీన్ని అమలు చేస్తున్నామని, వస్తున్న ఫీడ్ బ్యాక్‌కు తగ్గట్లు నిర్ణయాలను మార్చుకుంటామని తెలిపారు. విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసం పెంచేలా స్పోర్ట్స్ యాక్టివిటీస్ పెంచుతామని మంత్రి లోకేశ్ తెలిపారు.

# ప్రమాదకరంగానే దిల్లీ వాయు కాలుష్యం

**దిల్లీ:** దాదాపు వారం రోజుల తర్వాత గురువారం దిల్లీలో వాయు కాలుష్యం కాస్త తగ్గింది. అయినా ఇంకా ప్రమాదకరంగానే ఉంది. మరోవైపు గురువారం ఉదయం అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. దిల్లీలో ఉదయం 9 గంటల సమయంలో వాయు కాలుష్య నాణ్యత సూచీ 376గా నమోదైంది. ఉష్ణోగ్రత కనిష్ఠంగా 10.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ఈ శీతాకాలంలోనే ఇది అత్యల్ప ఉష్ణోగ్రతని భారత వాతావరణ కేంద్రం (ఐఎండీ) పేర్కొంది. దిల్లీలో పెళ్లిళ్ల సీజను కావడంతో కాలుష్యం తక్కువగా ఉండే సీఎన్‌జీ, బీఎస్-6 వాహనాలకు గిరాకీ పెరిగింది. కొన్ని నెలల ముందుగానే వాహనాలను బుక్ చేసుకుంటున్నారని ట్రావెల్ ఆపరేటర్లు తెలిపారు. దేశంలోనే అత్యంత కాలుష్య నగరంగా దిల్లీ నిలిచిందని గురువారం విడుదలైన ఓ నివేదిక వెల్లడించింది.

# మహిళలకు మంత్రి సవిత క్షమాపణలు చెప్పాలి

**అమరావతి:** ఏపీ శాసనమండలిలో మంత్రి సవిత చేసిన వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో డీబీటీ డబ్బుల ద్వారా మహిళలు గంజాయి, మద్యానికి బానిసలు అయ్యారని మంత్రి వ్యాఖ్యలు చేయడంపై ఎమ్మెల్సీలు మండిపడ్డారు. మంత్రి సవిత.. తక్షణమే రాష్ట్ర మహిళలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ..'సభలో మంత్రి సవిత తీవ్ర అభ్యంతరమైన వ్యాఖ్యలు చేశారు. మంత్రి సవిత తక్షణమే రాష్ట్రంలోని మహిళలకు క్షమాపణ చెప్పాలి. మంత్రి పదే పదే సభలో కాపుల గురించి ప్రస్తావించారు. కాపులు ఓటేశారు కాబట్టే కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ ఆరు నెలల్లో కాపులకు ఏం చేశారో మీరు సమాధానం చెప్పాలి. పది వేల కోట్లు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం బడ్జెట్‌లో ఒక్క రూపాయి ఇవ్వలేదు. దేశంలో ఎవరూ చేయనంత సంక్షేమం కాపులకు వైఎస్ జగన్ చేశారు. బటన్ నొక్కడం వల్ల మహిళలు గంజాయికి, మద్యానికి అలవాటు పడ్డారనడం దుర్మార్గం అని మండిపడ్డారు

ఎమ్మెల్సీ కుంభా రవిబాబు మాట్లాడుతూ.. 'సభలో బాధ్యత గల మంత్రులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. అనుచితమైన వ్యాఖ్యలతో కించపరిచేలా మాట్లాడుతున్నారు. మంత్రి సవిత మహిళలను అవమానించేలా మాట్లాడారు. సంక్షేమాన్ని అద్భుతంగా అమలు చేసిన నాయకుడు వైఎస్ జగన్. మహిళలు గంజాయి, మద్యానికి బానిసలైపోయారనడం దారుణం. సభ్య సమాజం తలదించుకునేలా మంత్రి సవిత వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ మాట్లాడుతూ.. ఎస్సీ, బీసీ, మైనార్టీలను అవమానించేలా కూటమి నేతల వైఖరి ఉంది. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్..హోంమంత్రిని చులకన చేసి మాట్లాడారు. దళిత హోంమంత్రి పదవిలో ఉండటం వల్లే చులకనగా మాట్లాడారని మేం భావిస్తున్నాం. మంత్రి సత్యకుమార్ ముస్లిం, మైనార్టీలను కించపరిచేలా మాట్లాడారు. ఈరోజు మంత్రి సవిత.. మహిళలు గంజాయి, మద్యానికి అలవాటైపోయారంటున్నారు. మంత్రులు ఇలాంటి



వ్యాఖ్యలు చేయడం వెనుక పెద్దలు ఉన్నారని మేం భావిస్తున్నాం. ఇలాంటి వ్యాఖ్యలు మానుకోకపోతే ప్రజలే బుద్ధి చెబుతారు. ప్రతీ ప్రైవేట్ స్కూల్‌లో 25 శాతం పేదలకు సీట్లు కేటాయించాలని చట్టం చెబుతోంది. వైఎస్ జగన్ అమ్మఒడి ద్వారా పేదలు చదువుకునేలా చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యార్థుల కోసం ఎలాంటి చర్యలు తీసుకున్నారో సమాధానం చెప్పాలి.

ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి మాట్లాడుతూ.. మంత్రి సవిత వ్యాఖ్యలు చాలా హేయమైనవి. ఒక మహిళా మంత్రిగా ఉండి ఇలా మాట్లాడటం సిగ్గుచేటు. ఈ కూటమి ప్రభుత్వంలో మహిళలకు కనీస విలువ లేదు. వైఎస్ జగన్ మహిళలకు పెద్దపీట వేశారు. మహిళలను కించపరిచే సంస్కృతి చంద్రబాబుది. 2014-19లో సాక్షాత్తూ చంద్రబాబు సీఎంగా మహిళలను కించపరిచేలా మాట్లాడారు. నోటితో చెప్పలేని విధంగా బాలకృష్ణ మహిళలను అవమానపరిచారు. తక్షణమే మహిళలందరికీ మంత్రి సవిత క్షమాపణ చెప్పాలి. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'సోషల్ మీడియా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు పెడుతోంది. అమాయకులను స్టేషన్లకు తీసుకెళ్లి చిత్రహింసలకు గురిచేస్తున్నారు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే చర్యలు తీసుకుంటామని చంద్రబాబు, పవన్, హోంమంత్రి చెబుతున్నారు. సోషల్ మీడియాలో టీడీపీ, జనసేన పెట్టిన తప్పుడు పోస్టులపై ఎందుకు మాట్లాడరు. మంత్రులను చెప్పులతో కొడతానని పవన్ మాట్లాడలేదా?. వైఎస్ జగన్‌పై నోటికొచ్చినట్లు పవన్ మాట్లాడలేదా?. పవన్ కళ్యాణ్ చేసింది నేరం కాదా?. మేం మాట్లాడితేనే నేరమా?. ప్రజా గొంతుకై మాట్లాడితే మాగొంతు నొక్కేస్తారా. కేసులకు మేం భయపడం.. ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొంటాం అని అన్నారు.

# వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ నినాదంతో.. 'స్వర్ణాంధ్ర 2047'

**అమరావతి:** రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను బ్యాలెన్స్ చేస్తూ కార్యక్రమాలు చేపడుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారని.. రాష్ట్రాన్ని నిలబెట్టే బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని చెప్పారు. భద్రత లేకుంటే రాష్ట్రంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రారన్నారు. శాసనసభలో 'స్వర్ణాంధ్ర-2047' డాక్యుమెంట్‌పై చర్చ సందర్భంగా సీఎం మాట్లాడారు. 'వెల్తీ, హెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్' నినాదంతో దీన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. "వైకాపా ప్రభుత్వ అక్రమాలపై లోతుల్లోకి వెళ్లే కొద్దీ ఆశ్చర్యకర విషయాలు తెలుస్తున్నాయి. చరిత్రలో ఏ రాజకీయ నాయకుడూ ఇన్ని తప్పులు చేయరు. వ్యవస్థలు విధ్వంసమయ్యాయి. అధికార యంత్రాంగం మొత్తం నిర్వీర్యమైంది. అప్పులు పరాకాష్ఠకు చేరాయి. తప్పుడు ప్రచారాన్నే ఆధారంగా చేసుకుని పనిచేశారు. వాస్తవాలు చెప్పినా వాటిని పక్కన పెట్టి అసత్యాలను పదేపదే చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని చూశారు. ఇది చాలా దురదృష్టకరమైన రాజకీయం. బరితెగించి తప్పులు చేసి వాటిని ఒప్పులుగా చిత్రీకరించారు. ఇలాంటి విచిత్ర పరిస్థితిని నా 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో ఎప్పుడూ చూడలేదు. ఎన్నికల్లో ప్రజలు విస్పష్ట తీర్పు ఇచ్చారు. 93 శాతం స్ట్రయిక్ రేటుతో కూటమికి అధికారం కట్టబెట్టారు. 1995లో నేను తొలిసారి సీఎం అయినప్పుడు ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉంది. ప్రజలకు చెప్తే సహకరించారు. అనివార్య పరిస్థితుల్లో అప్పట్లో రూ.2కి అందించే కిలో బియ్యం ధర పెంచాల్సి వచ్చింది. 1999లో విజన్-2020 తీసుకొచ్చాం. నాలెడ్జ్ ఎకానమీకి హైదరాబాద్ చిరునామాగా మారింది. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలంటే భద్రత ఉండాలి. ప్రజలు కూడా దీన్ని అర్థం చేసుకోవాలి. వారికి చెప్పాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది. ప్రజలను చైతన్యం చేయాలి. 2047 నాటికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి వందేళ్లు అవుతుంది. ప్రధాని మోదీ వికసిత్ భారత్ పిలుపునిచ్చారు. మనం స్వర్ణాంధ్ర-2047 నినాదంతో ముందుకెళ్లాలి. ఎమ్మెల్యేలపై గురుతర బాధ్యత ఉంది. నియోజకవర్గ పరిధిలోనూ విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలి. 2047 నాటికి మీ నియోజకవర్గం ఎలా ఉండాలని కోరుకుంటున్నారో అందులో పొందుపర్చాలి. ప్రజలకు సేవ చేస్తే ఏ నియోజకవర్గమైనా గెలిపిస్తారు"అని చంద్రబాబు అన్నారు.





# ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సెంటర్ ప్రారంభం

**విల్లివాకం న్యూస్:** కాంచీపురం జిల్లా, తిరుముడి వాక్కంలోని సిడ్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా ఏర్పాటు చేసిన ప్రెసిషన్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సెంటర్‌ను ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ మేరకు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఇలా పేర్కొన్నారు. తమిళనాడులోని 3 లక్షలకు పైగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు లబ్ధి చేకూర్చేందుకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ తరపున శుక్రవారం జరిగిన కార్యక్రమంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ ప్రెసిషన్ మాన్యుఫ్యాక్చరింగ్ గ్రూప్ ద్వారా కాంచీపురం జిల్లా తిరుముడివాక్కం సిట్కో ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో దక్షిణ భారతదేశంలో మొదటిసారి ప్రెసిషన్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సెంటర్‌ను ప్రారంభించారు. ఎంఎస్ఎంఈల కోసం అంతర్జాతీయ వ్యాపార మార్కెట్‌లో పోటీ పడేందుకు మరియు అభివృద్ధి చెందుతున్న పరిశ్రమ విభాగంలోకి ప్రవేశించడానికి వారి ఉత్పాదకత మరియు ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి తమిళనాడులోని 5 ప్రదేశాలలో 100 కోట్ల మెగా క్లస్టర్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయబడుతుందని ప్రభుత్వం తరపున తెలియజేయబడింది.

## సిలంబం క్రీడాకారులకు సత్కారం

**విల్లివాకం న్యూస్:** ఆల్ ఇండియా సిలంబం కౌన్సిల్ అధ్యక్షుడు మురుగక్కని మరియు తమిళనాడు సిలంబం పేరవై అధ్యక్షుడు ఈసన్ ఏర్పాటులో మలేషియాలో బోర్కల సిలంబం నిర్వహించిన అంతర్జాతీయ సాంస్కృతిక సిలంబ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు పత్తుమలై మురుగర్ ఆలయానికి వెళ్లినప్పుడు సీనియర్ సిలంబ ఉపాధ్యాయుడు సాండో రత్నం మరియు చంద్రశేఖర్ అసన్ జ్ఞాపికలను అందజేసి సత్కరించారు.



# మత్స్యకారుల సంక్షేమమే సీఎం లక్ష్యం : రాజకన్నప్పన్



**విల్లివాకం న్యూస్:** కన్యాకుమారి జిల్లా నాగర్ కోయిల్‌లో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ మహా సభ జరిగింది. సమావేశంలో పాడిపరిశ్రమ శాఖ మంత్రి రాజకన్నప్పన్, తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరుంతకై ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో పాడిపరిశ్రమ శాఖామంత్రి రాజా కన్నప్పన్ మాట్లాడుతూ.. మత్స్య కారుల కోసం రామనాథపురంలో చారిత్రాత్మకమైన మత్స్యకారుల సదస్సును ముఖ్యమంత్రి నిర్వహిం చారు. చెన్నైలో వరదలు వచ్చినప్పుడు ఒక్కరోజులో వరదను తొలగించి కరెంటు అందించిన ఘనత మన ముఖ్యమంత్రి హయాంలో ఉందని గుర్తుంచుకోండి. ఫిషింగ్ బ్యాన్ రిలీఫ్ ఫండ్‌ను 5 వేల నుంచి 8 వేలకు పెంచిన ఘనత ముఖ్యమంత్రిదే. మత్స్యకారుల సంక్షేమానికి ఎల్లవేళలా ముఖ్యమంత్రి కట్టుబడి ఉన్నారని తెలిపారు. ఆయన అద్భుతమైన ద్రవిడ పాలనను నడుపుతున్నారు.

# జయకుమార్ వ్యాఖ్యలపై కనిమొళి స్పందన



**గిండి న్యూస్:** వచ్చే అసెంబ్లీ ఎన్నికల తర్వాత డీఎంకే బహిష్కృతమవుతుందని అన్నాడీఎంకే మాజీ మంత్రి జయకుమార్ చెప్పడంపై డీఎంకే ఎంపీ కనిమొళి స్పందించారు.దీనిపై విలేకరులు ప్రశ్నించగా ఆమె మాట్లాడుతూ.. జయకుమార్ వేరే పనికి వెళ్లలేక, ఏఐఏడీఎంకే మరో పని ఉండటంతో పార్ట్ టైం ఆరుడం చెప్పడం మొదలుపెట్టారు.ఇలా చూడగలిగే వారు కూడా ఇలాగే మాట్లాడతారు. భయంతో వచ్చే వ్యాఖ్యలు ఇవి.పార్లమెంటు సమావేశాల్లో దేశంలోని ముఖ్యమైన సమస్యలపై ప్రశ్నలు లేవనెత్తడం ప్రతిపక్ష పార్టీల విధి. ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ తో పాటు అక్కడ ఉన్న ఇతర పార్టీల సలహా మేరకు ఏయే అంశాలపై చర్చించాలనే దానిపై నిర్ణయం తీసుకోవచ్చని పేర్కొన్నారు.

# చెన్నై హాఫ్ మారథాన్ 2024కు స్పందన

**విల్లివాకం న్యూస్:** చెన్నై హాఫ్ మారథాన్ యొక్క 6వ ఎడిషన్‌లో 6000 మంది రన్నింగ్ ఔత్సాహికులు నవంబర్ 24, 2024 ఆదివారం నాడు జరిగే అత్యంత ప్రతిష్టాత్మకమైన రన్ ఈవెంట్‌లో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారు. ఎన్ఈబి స్పోర్ట్స్ మరియు అపోలో టైర్స్ ఆధ్వర్యంలోని ఈ ఈవెంట్‌లో పాల్గొనేందుకు అన్ని రంగాలకు చెందిన రన్నర్లు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు. ఇది ఓల్కాట్ మెమోరియల్ హైస్కూల్ గ్రౌండ్, బీసెంట్ నగర్ నుండి ఫ్లాగ్-ఆఫ్ చేయబడుతుంది. ఈ ఈవెంట్‌లో రన్నర్లు మూడు వేర్వేరు విభాగాలలో పోటీపడనున్నారు. హాఫ్ మారథాన్ ఉదయం 4.30 గంటలకు ప్రారంభమవుతుంది. చెన్నై ఈ ఈవెంట్‌ను నిర్వహించడం మరియు దానికి వచ్చిన మంచి స్పందన చూడటం చాలా ఆనందంగా ఉంది. నేను ఫిట్‌నెస్ ఔత్సాహికుడినైనందున, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం యొక్క ప్రాముఖ్యతను నేను అర్థం చేసుకున్నాను.



సమాజం కలిసికట్టుగా ఉంటే, అది సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని ప్రతాప్ సింగ్ - డైరెక్టర్ జనరల్ - ఇన్వెస్టిగేషన్స్ అన్నారు. మేము శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం మరియు బృంద స్ఫూర్తికి మద్దతిచ్చే జీవనశైలికి ప్రాముఖ్యత నిస్తామని అపోలో టైర్స్‌కు చెందిన స్పోర్ట్స్ మార్కెటింగ్ అండ్ కమ్యూనిటీస్ హెడ్ రెమస్ డి'క్రూజ్ తెలిపారు.

# అల్పపీడనం ఎఫెక్ట్.. ఏపీకి భారీ వర్ష సూచన

**విశాఖపట్నం:** ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారం నాటికి మరో అల్పపీడనం ఏర్పాడే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. రెండు రోజుల్లో అది వాయుగుండంగా బలపడుతుందని ఐఎండీ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో ఏపీలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దక్షిణ అండమాన్ సమీపంలో గురువారం ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారం నాటికి అల్పపీడనం ఏర్పడే అవకాశముంది. రెండు రోజుల్లో అది వాయుగుండంగా బలపడుతుందని ఐఎండీ అంచనా వేస్తోంది. వాయుగుండం కారణంగా ఏపీలో మంగళ, బుధవారాల్లో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కోస్తాంధ్ర జిల్లాల్లో అతి భారీ వర్షాలు, రాయలసీమలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు.దఈ అల్పపీడనం తుపానుగా బలపడేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్లు వాతావరణ నిపుణులు చెబుతున్నారు. తర్వాత తీవ్ర వాయుగుండంగా బలహీనపడి, 27 నాటికి తమిళనాడు లేదా ఏపీలో తీరం దాటుతుందని అంచనా వేస్తున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో రైతులు, మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు చెబుతున్నారు.





# సివి రామన్ పరిశోధనలు భావితరానికి ఆదర్శనీయం

**తిరువళ్లూర్ న్యూస్:** నోబుల్ అవార్డు గ్రహీత శాస్త్రవేత్త సర్ సివి రామన్ పరిశోధనలు భావితరాలకు ఆదర్శనీయంగా నిలుస్తుందని విప్రో రీజినల్ హెడ్ ఆనందకృష్ణ దేవరాజ్ స్పష్టం చేశారు. సర్ సివి రామన్ జయంతి నీ పురస్కరించుకుని తిరువల్లూరు జిల్లా అరుణ్ ఆయిల్ కుప్పంలోని ప్రత్యూష ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ సైన్స్ ఫెయిర్ ప్రయోగ 2024 పేరిట ప్రత్యేక ఎగ్జిబిషన్ను నిర్వహించారు. ఈ ఫెయిర్ కు తిరువల్లూరు కాంచీపురం చెన్నై చంగల్పట్టు తదితర జిల్లాల నుంచి సుమారు 2500 మంది విద్యార్థులు పాల్గొని సృజనాత్మకతో కూడిన నూతన ఆవిష్కరణలను ప్రదర్శించారు. ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవానికి కళాశాల చైర్మన్ రాజారావు అధ్యక్షత వహించగా ప్రిన్సిపల్ ఆర్ఎస్ కుమార్ ప్రారంభ ఉపన్యాసం చేశారు. కళాశాల సీఈఓ ప్రత్యూష వైస్ చైర్మన్ చరణ్ తేజ తదితరులు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విప్రో రీజినల్ హెడ్ ఆనందకృష్ణ దేవరాజ్ హాజరై ఎగ్జిబిషన్లు ప్రారంభించారు అనంతరం విద్యార్థులు ప్రదర్శనలు ఉంచిన సైన్స్ అండ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ గణితం తదితర రంగాలకు చెందిన 3 ప్రాజెక్టుల ప్రయోగాలను వాటి నమూనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆనందకృష్ణ దేవరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక దశమించే పరిశోధనలు నూతన ఆవిష్కరణలపై ఆసక్తి ప్రదర్శించాలని పిలుపునిచ్చారు. హా కతాన్ ఐడియా తాన్ రోబో తాన్ డ్రోన్ అవుతాన్ ఏ ఆర్ వి

**విప్రో రీజినల్ హెడ్ ఆనందకృష్ణ దేవరాజ్**

ఆర్ లతో సహా ఉత్తేజ కరమైన ఈవెంట్లలో విద్యార్థులు పాల్గొని తమ నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. ఆకర్షనీయమైన సృజనాత్మకమైన నైపుణ్యాలపై విద్యార్థులు తమ అన్వేషణను ప్రారంభించాలని ఆయన సూచించారు ప్రపంచవ్యాప్తంగా సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాముఖ్యత పెరుగుతూ ఉన్న క్రమంలో విద్యార్థుల సైతం అందుకు అనుగుణంగా పరిశోధనలు చేయాలన్న ఆయన సంబంధిత ప్రయోగాలు దేశానికి ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. ప్రత్యూష కళాశాలలో నిర్వహించిన ప్రయోగా వంటి ఎగ్జిబిషన్లు విద్యార్థుల శాస్త్రీయమైన నైపుణ్యాలను ప్రదర్శించడానికి వేదికవుతుందని ఆయన స్పష్టం చేశారు అనంతరం ప్రదర్శనలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన పరిశోధనలకు సర్టిఫికెట్లతో పాటు 50 వేల రూపాయల బహుమతులను ప్రధానం చేశారు ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు అధ్యాపకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# తాంబరం నుంచి చెంగల్పట్టుకు ప్రత్యేక రైళ్లు

**అన్నానగర్ న్యూస్:**నిర్వహణ పనుల కారణంగా చెన్నై బీచ్-చెంగల్పట్టు మార్గంలో 22 నుంచి 28 ఎలక్ట్రిక్ రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారు. తెల్లవారుజాము నుండి సేవ రద్దు చేయబడినప్పటికీ, భర్తీ చేయడానికి కొత్త టైమ్‌టేబుల్ విడుదల చేయబడింది.రైళ్లు ప్రజలపై ప్రభావం చూపకుండా ఉదయం మరియు సాయంత్రం రద్దీ సమయాల్లో రీషెడ్యూల్ చేసి నడపబడతాయి. చెన్నై నగరాన్ని శివారు ప్రాంతాలతో కలిపే వంతెనగా పనిచేసే ఎలక్ట్రిక్ రైళ్లలో రోజూ లక్షలాది మంది ప్రయాణిస్తున్నారు.అయితే మున్సిపల్ రవాణా సంస్థ అదనపు ప్రత్యేక బస్సులను నడిపింది. తాంబరం నుంచి చెంగల్‌పట్టుకు 10 బస్సులు, పరిమునైకు 10 బస్సులు నడిపారు. ఇప్పటికే కేబాక్కం బస్ స్టేషన్‌కు సరిపడా బస్సులు తిరుగుతుండగా, ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి బస్సుల సంఖ్యను పెంచనున్నట్లు అధికారులు తెలిపారు. ఎలక్ట్రిక్ రైలు



కారణంగా తాంబరం, ఎగ్మోర్, పార్క్‌నగర్, ఫోర్ట్ రైల్వే స్టేషన్‌లలో స్వల్ప రద్దీ కనిపించింది. పెద్ద నష్టం లేదు. సింహపెరుమాళ్ ఆలయం వరకు 5 రైళ్లు నడుపుతున్నట్లు బీచ్ రైల్వే స్టేషన్‌లో నోటీసు బోర్డు కూడా ఉంచారు.మెట్రో రైలు విషయానికొస్తే పీక్ సీజన్‌లో రైళ్లు నడుస్తాయి. అవసరమైతే మెట్రో నడపడానికి సిద్ధంగా ఉన్నామని మెట్రో అధికారులు తెలిపారు.

## దైవ నామ ధ్యానము

భగవంతుని నామము
ధ్యానిస్తే పుణ్యము
మనసులు శుద్ధిచేసి
ప్రసాదించు మోక్షము

శక్తిగలది నామము
చేయకు నిర్లక్ష్యము
దోషాలు దిద్దుకున్న
శుభ్రమగును హృదయము

భగవంతుని సన్నిధి
అందరికీ పెన్నిధి
ఆశ్రహిస్తే గనుక
ఆనందం ఉన్నది

ఘనము దైవ నామము
నమ్ముకున్న క్షేమము
అనుకుంటే మాత్రం
అతిపెద్ద ఆశ్రయము

అశుభములు తొలిగించు
అద్భుతమైన నామము
మనశ్శాంతి కలిగించు
మహోన్నతం నామము

ఆ నామము తోడుగా
బ్రతుకులో ఉండగా
భయమేలనోయ్!దండగ
ప్రతిరోజూ పండుగ

-గద్వాల సోమన్న
9966414580





తమిళనాడు రాష్ట్ర బాక్సింగ్ అమెచన్ సంఘం వేలూరు బాక్సింగ్ సంఘం సంయుక్తం గా వేలూరు నేతాజీ స్టేడియంలో బాక్సింగ్ పోటీలు నిర్వహించారు ఈ పోటీలను కలై మొగల్ ఇలంగో ప్రారంభించారు వీటిలో ఆ సంఘం అధ్యక్షులు శ్రీధర్ ప్రధాన కార్యదర్శి పృథ్వీరాజ్ కార్యదర్శి రాజ్ కుమార్ కోశాధికారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు ఈ పోటీలు రెండు రోజులపాటు జరుగుతుందని ఇందులో ఆంధ్ర కర్ణాటక తమిళనాడు రాష్ట్రారాష్ట్ర కలుసుకుంటారని నిర్వాహకులు తెలిపారు,, - వేలూరు

## తెన్కాశి జిల్లాలో నేడు పాఠశాలలకు సెలవు



**విల్లివాకం న్యూస్:** ఓటరు జాబితాలో పేర్లు చేర్చడం, తొలగించడం, సరిదిద్దడం వంటి వాటిపై శిబిరం ఉండడంతో తెన్కాశి జిల్లాలో శనివారం పాఠశాలలకు సెలవు ప్రకటించారు. దీనికి బదులు 30న పాఠశాలలు పనిచేస్తాయని ప్రిన్సిపల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ ప్రకటించారు.

# క్షేత్రస్థాయి సమావేశంలో రగడ

**విల్లివాకం న్యూస్:** 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలను అన్నా డీఎంకే ఎదుర్కోనున్నందున వివిధ చర్యలు చేపడుతున్నారు. అందులో భాగంగానే అన్నాడీఎంకే అన్ని జిల్లాల్లో క్షేత్రస్థాయి సర్వే సమావేశం నిర్వహించనుంది. ఇందుకు ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆదేశించారు. ఆ విధంగా ఎడిఎంకె వివిధ జిల్లాల్లో క్షేత్రస్థాయి అధ్యయన సమావేశం నిర్వహిస్తున్నారు. నెల్లై మెట్రోపాలిటన్ జిల్లా వడయార్‌పట్టి నెల్లి జంక్షన్ లోని ఓ ప్రైవేట్ హాలులో క్షేత్రస్థాయి అధ్యయన సమావేశం జరిగింది. ఇందులో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగి తోపులాట జరిగింది. కొందరు నిర్వాహకులు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇది చూసిన ఎస్ పి వేలుమణి, ఇక్కడ గొడవ



పడేవాళ్లకు, అదుపు లేని వాళ్లకు ఆస్కారం లేదు. తప్పు చేసిన వారిపై పార్టీ విచారణ జరిపి చర్యలు తీసుకుంటుందన్నారు. కాబట్టి అందరూ సంయమనం పాటించండి అన్నారు.




# మహాబలిపురంలో మంత్రి రాజేంద్రన్ తనిఖీలు



**గిండి న్యూస్:** మామల్లపురం ఈస్ట్ కోస్ట్ రోడ్‌లో తమిళనాడు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ హాస్టల్ పనిచేస్తోంది. ఈ హోటల్‌ను పర్యాటక శాఖ మంత్రి రాజేంద్రన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనంతరం కాంప్లెక్స్‌లోని ప్యాసింజర్ క్వార్టర్స్, స్విమ్మింగ్ పూల్, టాయిలెట్స్, భవనాలు, కిచెన్, క్లాసికల్ స్కల్ప్చర్ పార్కును సందర్శించారు. పార్కును నిర్వహించి ప్రాచుర్యం కల్పించాలని సూచించారు.అనంతరం మామల్లాపురంలోని పాత టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ హాస్టల్, బస్టాండ్ సమీపంలోని ఎమరాల్డ్ పార్క్, రూ.8 కోట్లతో 10 లక్షల లైట్లతో వెలిగే గార్డెన్ ఏర్పాటు పనులను, తలసాయన పెరుమాళ్ ఆలయ సముదాయంలో త్రీడీ యానిమేషన్ ప్రాజెక్టులను సందర్శించారు. రూ.5 కోట్లతో పనులు చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

